క్లుప్తంగా

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న లెనిన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. పుస్తకాలు అమ్ముతున్న నగరంలోని శశి, కేకేఆర్ గౌతమ్ స్కూల్, చైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. శశి, కేకేఆర్ గౌతమ్ స్కూల్లో అధిక ఫీజులే కాకుండా అధిక రేటుతో పుస్తకాల పేరుతో కూడా దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.3 వేలు విలువ చేసే పుస్తకాలను రూ.8 వేలు, రూ.10 వేలు చొప్పున విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మేస్తున్నారని వివరించారు. తమ పాఠశాలలోనే పుస్తకాలు కొనాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్న పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని లెనిన్ కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న సురేంద్ర

ఏలూరు(మెట్రో): సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్ధవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సురేంద్రకు సూచించారు. జిల్లా సమాచార పౌర సంబంధాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా సమాచా ర పౌర సంబంధాధికారి యు.సురేంద్ర గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సురేంద్రకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సమాచార శాఖ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేయాలన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, జిల్లా పౌర సంబంధాధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు, తదితరులు ఉన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 45 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో గురువారం నిర్వహించిన డీఈఎల్ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షకు 45 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఒకరు గైర్హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు.

వ్యాధుల కాలం.. జర భద్రం

- వ్యాధి కారకాలు దోమలు
- ఏలూరులో డెంగీపై అవగాహన

ఏలూరు టౌన్ : రాబోయే కాలంలో వైరల్ ఫీవర్స్ ప్రజలను బెంబేలెత్తిస్తుంటాయి. విష జ్వరాలతో తీవ్ర అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఇక నీటి కాలుష్యంతో వచ్చే టైఫాయిడ్‌తోపాటు, దోమకాటుతో మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రాణాపాయ పరిస్థితిని తీసుకొస్తాయి. ఏలూరు నగరంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటంతోపాటు, మంచినీటి నిల్వలు లేకుండా నిత్యం జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మలేరియా నివారణ అధికారులు సూచిస్తున్నారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాలిని, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, ఏలూరు మలేరియా అధికారి జె.గోవిందరావు ఆధ్వర్యంలో ప్రజలకు మలేరియా, డెంగీ దోమల వ్యాప్తిపై అవగాహన కల్పిస్తున్నారు.

విష జ్వరాలతో అప్రమత్తం

వర్షాకాలంలో ప్రజలు విషజ్వరాల బారినపడే అవకాశాలు అధికంగా ఉంటాయి. సీజన్ మారుతూ ఉండడంతో వాతారణంలో మార్పులు, డ్రెయినేజీల్లో మురుగునీటి పారుదల లేకపోవటంతో దోమలు విజృంభిస్తాయి. డెంగీ కారక దోమలు మంచినీటి నిల్వల్లో ఉత్పత్తి అవుతూ ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య అధికారులు సూచిస్తున్నారు. పగటి వేళ ఏడిస్ ఈజిప్ట్ అనే దోమకాటుతో డెంగీ జ్వరాల బారిన పడతారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరుతున్నారు. ఏలూరు నగరంలో మలేరియా కేసులు పెద్దగా ఉండవని, డెంగీ దోమలు అధికంగా ఉంటూ ప్రతి ఏటా కేసులు నమోదవుతున్నాయని వైద్య అధికారులు చెబుతున్నారు. గత నాలుగేళ్లలో చూస్తే మలేరియా కేసులు పదిలోపు నమోదవుతున్నాయి. డెంగీ జ్వరాలు ఆందోళన కరంగా మారాయి.



ఏలూరులో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



డెంగీ దోమల నివారణకు నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా నివారణ సిబ్బంది

డెంగీ లక్షణాలు

- ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ల నొప్పులు
- కళ్ల నొప్పులు, కంటి కదలిక తగ్గటం, నొప్పి
- ఒక్కోసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం
- అధికం దాహం, నోరు తడారిపోతుంది
- డెంగీ దోమకాటు అనంతరం 3 నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి
- డెంగీ సోకిన అనంతరం సాధారణంగా 80 శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది
- వ్యాధి తీవ్రతతో రక్తంలోని ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ప్రాణాంతకంగా మారే ప్రమాదం
- వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు మాక్ ఎలీసా పరీక్షలు చేయించుకోవాలి
- డెంగీ గర్భిణులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధి బాధితులు వెంటనే వైద్యులను సంప్రదించాలి

నివారణ చర్యలు

- దోమతెరలు వాడాలి
- ఇంటి కిటికీలు, తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- నీటి తొట్టెలను విధిగా ప్రతి శుక్రవారం పరిశుభ్రం చేసుకోవాలి
- తాగి పారేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలి
- ఎయిర్ కూలర్లు, ఫ్లవర్‌వాజ్‌లు, పూల కుండీల్లోని నీటిని తరచూ మార్చుతూ ఉండాలి
- మలాథియాన్ టెక్నికల్ మందును ఫాగింగ్ ద్వారా దోమలను నిర్మూలించవచ్చు

ఏలూరు నగర ప్రాంతాల్లో..

సంవత్సరం	డెంగీ కేసులు	సంవత్సరం	డెంగీ కేసులు
2020	35	2023	47
2021	69	2024	59
2022	54	2025	04

దోమల నివారణపై శ్రద్ధ



వర్షాలు, వాతారణ మార్పులతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా డెంగీ దోమలను నివారించే అవకాశం ఉంది. వ్యాధి నిర్ధారణకు ఎలాసా టెస్టును ఏలూరు జీజీహెచ్‌తో పాటు, ఏరియా హాస్పిటల్స్‌లోనూ చేస్తున్నారు. తీవ్రమైన జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవటంతోపాటు సరైన చికిత్స పొందాలి. ప్లేట్‌లెట్స్ పడిపోవటం కారణంగా ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ఏలూరు నగరంలో ప్రజలకు విస్తృంగా అవగాహన కల్పిస్తున్నాం.

– జె.గోవిందరావు, మలేరియా అధికారి, ఏలూరు

ఉచితంగా భూముల విభజన

జేసీ ధాత్రిరెడ్డి



ఏలూరు(మెట్రో): సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు తమ భూములను విభజనకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.500 రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితముగా ఈ సేవను పొందుటకు అవకాశం కల్పించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. రుసుము రూ.50 గ్రామ సచివాలయంలో చెల్లించి జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ అవకావాన్ని జాయింట్ పట్టాదారులు వినియోగించుకోవాలని కోరారు. దీంతో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలకు అర్హులవుతారని, జాయింట్ పట్టాదారులుగా నమోదయిన భూ యజమానులు జాయింట్ పట్టా విభజనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జేసీ పేర్కొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందిస్తున్న హెచ్ఎం రాంబాబు

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం గుడివాడకలంక మోడల్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు బి.రాము ఆర్థిక సాయంతో రాత పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయుడు నంబూరి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా రాముని ఎస్ఎంసీ చైర్మన్ ఘంటశాల సుబ్బారావు, ఉపాధ్యాయుడు అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా యోగాంధ్ర



యోగాసనాలు వేస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు మాట్లాడుతూ సమస్త మానవాళికి భారతదేశం అందించిన ఆరోగ్యాన్ని సమకూర్చే గొప్పవరం యోగా అని, ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయడానికి ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు. కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత రాజ మార్గంలో నడవడానికి యోగా అభ్యసన అన్నివిధాలుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యఅతిథి ప్రముఖ యోగా బోధకుడు ఆదినారాయణ యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. అనంతరం యోగా బోధకులు విద్యార్థులు, కళాశాల సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమాన్ని యోగా దినోత్సవ కళాశాల ఇన్‌చార్జి టీవీ దుర్గా ప్రసాద్ పర్యవేక్షించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరస్థితిలో భక్తుల ప్రయాణం



శ్రీవారి కొండపైకి బొలేరో ట్రక్కు వాహనంలో వస్తున్న భక్తులు



ట్రక్కు ఆటోలో కొండపైకి వస్తున్న భక్తులు

- ట్రక్కు ఆటోల్లో కిక్కిరిసి శ్రీవారి క్షేత్రానికి వస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి క్షేత్రానికి కొందరు భక్తులు ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ట్రక్కు ఆటోలు, బొలేరో ట్రక్కు వాహనాల్లో పరిమితికి మించి భక్తులు ఎక్కి దైవ దర్శనార్థం శ్రీవారి క్షేత్రానికి వస్తున్నారు. మర్గం మధ్యలో పెనుప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటనేది వారు ఆలోచించడంలేదు. ఏదో ఒక విధంగా క్షేత్రానికి వచ్చి వేంకటేశ్వర స్వామి వారిని దర్శించాలన్న ఆతృత, చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారుల వ్యవహార శైలి మాటున ప్రమాదాలు పొంచి ఉన్నాయి. క్షేత్రంలో వివాహాలు జరిగే సమయంలో ఇలాంటి ప్రయాణాలు ఎక్కువగా ఉంటున్నాయి. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ఇటువంటి ప్రయాణాలను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని స్థానికులు, భక్తులు అధికారులను కోరుతున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	27	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	66
వంకాయలు (కాంతులు)	26	బీళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	48
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	38	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	86
క్యాబేజీ	24	అల్లం	64
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

మర్యాదపూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డితో కమిలు జామా

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ డాక్టర్ కమిలు జామా, ముస్లిం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ముస్లిం మైనార్టీ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వైఎస్ జగన్ హామీ ఇచ్చారని జామా తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను గాలికి వదిలేసిందని ఆరోపించారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' అందించాలి

కామవరపుకోట: అర్హులైన వారందరికీ తల్లికి వందనం అందించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం అందిస్తున్న డబ్బులు వివిధ కారణాలు చూపించి అనేక మందికి ఎగ్గొట్టారన్నారు. స్థానిక కొత్తూరు యానాదులు కాలనీకి చెందిన చౌటూరి కోటమ్మ 300 హైబడి యూనిట్లు విద్యుత్ వాడిందని, తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు ఆపేశారని తెలిపారు. చాలీచాలని ఆ ఇంటిలో రెండు బల్బులు వాడిన ఆ కుటుంబానికి 300 యూనిట్లు బిల్లు ఎలా వస్తుందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధితో అర్హులందరికీ తల్లికి వందనం డబ్బులు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనికెళ్ల రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, ఎంపీడీఓ కె.సరళ కుమారి, ఎంఈఓ డి.సుబ్బారావు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో సీపీఐ మహాసభలు

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు ఏరియా 6వ మహాసభలు ఈ నెల 21, 22 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా మహాసభలు వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో చింతలపూడి మండలంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్ నుంచి వందలాది మంది ప్రజలతో పవర్ పేట స్టేషన్ రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ, అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కురెళ్ళ వరప్రసాద్, కొంపల్లి కృష్ణమాచార్యులు, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, మావూరి విజయ, కొల్లూరి సుధారాణి, గొర్లి స్వాతి, వెదురుపర్తి శారద, లక్కోజు జగదీశ్వరి, భజంత్రీ శ్రీనివాసరావు, యర్రా వెంకటేశ్వరరావు, బేతా శంకర్, శాయన అభిలాష్ కుమార్, పాల రామకృష్ణ, లక్ష్మి, ఉప్పులూరి లక్ష్మి, భవాని, అడ్డగర్ల సాకేత్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మహాసభల వాల్‌పోస్టర్ విడుదల చేసిన పార్టీ నాయకులు

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చింతలపూడి : విత్తనాలు ఎంఆర్‌పీ ధరకు మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా హెచ్చరించారు. చింతలపూడి మండలంలోని పలు విత్తనాల దుకాణాల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. విత్తనాల శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా బాషా విలేకరులతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, విక్రయించిన విత్తనాలకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని వ్యాపారులను ఆదేశించారు. గుర్తింపు పొందిన, లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనాలని రైతులకు సూచించారు. విత్తన కొనుగోలు రసీదు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. పగిలిన ప్యాకెట్లు లేదా మూతలు తీసిన డబ్బాలోని విత్తనాలను కొనొద్దని రైతులకు సూచించారు. తనిఖీల్లో చింతలపూడి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

లింగపాలెం షాపులో తనిఖీ

లింగపాలెం: స్థానిక పురుగు మందుల షాపులో వ్యవసాయ శాఖ డీఏఓ హబీబ్ బాష గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులోని మందుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. పురుగు మందులు కొన్న రైతులకు బిల్లులు ఇవ్వాలని, మందులు అధిక రేట్లకు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

మద్ది హుండీల ఆదాయం రూ.54.71 లక్షలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో హుండీ ఆదాయన్ని గురువారం లెక్కించినట్టు మద్ది ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. 85 రోజులకు హుండీల ద్వారా రూ.49,67,182, చిల్ల రూపేణా రూ.4,22,927, అన్నదానం హుండీ ద్వారా రూ.81,370 మొత్తం ఆదాయం రూ.54,71,479 వచ్చినట్టు చెప్పారు. ఏలూరు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు.

అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయండి

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని వదిలి అంబేడ్క రాజ్యాంగాన్ని అమలు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిటికెన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన తన నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, సూపర్ సిక్స్ హామీ పథకాలు అటకెక్కాయని ధ్వజమెత్తారు. పథకాలపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పాలనలోకి వచ్చిన సంవత్సరం వ్యవధిలోనే కూటమి పాలనపై ప్రజలు విరుచుకుపడుతున్నారని తెలిపారు. కక్ష సాధింపు చర్యలు మానుకొని ప్రజాస్వామ్యయుతంగా పాలించాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత విషయాలను ఆయన కుటుంబాన్ని కించపరిచే విధానాలను మానుకోవాలని హితవుపలికారు. పార్టీ నాయకులు నిక్కర్ నాగేశ్వరరావు, తొంటా వాసు, మారిశెట్టి శ్రీనివాస్, చిడిపి రవి, చిరిగిన నాగార్జున, పులపాకులు బన్నీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై వినతి

కుక్కునూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా నాయకులు కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కుక్కునూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందిని ప్రజాసాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదును తొలిగించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరారు. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మెనూ ధర పెంచి సరుకులను ప్రభుత్వమే నేరుగా అందజేయాలని, సన్న బియ్యం సరఫరా చేసి మెరుగైన వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జూలై 9 నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని దారయ్య పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ సమస్యలపై కుక్కునూరు ఐసీడీఎస్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.